# ౯ ఫినైల్ వాష్

"హారిజనలడ్కీ" అని వొక టాకీ ప్రదర్శనం "ఇయంగేహే లక్ష్మీ" అని వొక టాకీ ప్రదర్శనం, రెండూ రెండు పెండాల్సులో "నేత్ర బంద్‌పురం" అనే నగరాన్ని 30—10—1938 తేదీ రేత్రికోసం బుక్కైనాయి.

ఆ సంగతి తెలిసి "ఆరుహన్నర ఆటకే ఆ రోజున మనం వెళ్ళిపోవాలి సుమండీ!" అని 1—10—938 ని జీతం అంది పుచ్చుకుని ఇంటికివచ్చిన తన మగనితో రోహిణి అంది. రోహిణి పెనిమిటి రంగారావు "రెండు పెండాల్సులో రెండు ఆటలు ఎడ్వర్టైజు అవుతున్నాయి. దేనికి వెడదాం?" అని అడిగేడు. "దేనికేమిటండీ! ఇయంగేహేలక్ష్మీ పేరు చూడండీ ఎంత బాగుందో! దానికి వెడదాం—" అంది రోహిణి. రంగారావు "హారిజనలడ్కీ" అపూడేట్‌గా వుండేటట్టుంది — అయినా దేనికో వొకదానికి వెళ్లొచ్చు: నా చేతిలోవుంటే డబ్బాగదు; ఈ రూపాయి నీ దగ్గరవుంచి 30—10—38 సాయంత్రం పైకితీసి నాకియ్య టిక్కట్లకు" అని భార్యచేతిలో వో రూపాయి పెట్టేడు. "టిక్కట్లకు సరే! మరి కిళ్ళీలకు! పువ్వులకు!" అంది. "మరో అర్ధరూపాయి ఇదిగో?" అని యిచ్చాడు. "బండికి?". "అబ్బ! ఇదిగో! కడం అర్ధ!"

ఆ మర్నాటినుంచి రంగారావుకూ రోహిణికీ ఆ రెండు టాకీ ప్రదర్శనాలను గురించిన విమర్శనలూ వార్తాపత్రికల్లో చదవటమే పని. గోడలమీద అంటించిన బొమ్మలు చూడ్డమే విధి. వీధమ్మట వాయింప బడుతూవున్న బాజాలు వినడమే కర్తవ్యం—వాళ్ళకో నవుకరు 'బంజర్ గాడు' అని వున్నాడు—ఆ "బంజర్న్ని" పిలచి వానిద్వారా అత్తమామ్మా, ఊళ్లోవాళ్ళు ఆ రాబోయే టాకీలు ఎలా వుంటాయి అని అనుకుంటూ వున్నారో ఆ వృత్తాంతం తెలిసికొనడమే తీరికముచ్చట.

కాలంగడచి, ఆ టాకీలను గురించి "రూమరు" పాకిపోయినకొద్దీ దంపతులిద్దరిలోను భేదాభిప్రాయాలు బలిసిపోయినాయి. రంగారావు "హరిజనలడ్కీ"కే వెళ్ళాలి. "ఇయంగేహే లక్ష్మి ఏమిటీ? పనికిరాదు!" అన్నాడు. 30—10—1938, అయిదు గంటలకు సాయంత్రం పైగా నే క్లబ్బునుంచి వచ్చేసరికి చీరకట్టుకు సిద్ధంగావుండు' అని అంటూ వెళ్ళిపోతున్నాడు. వెళ్ళిపోతున్న భర్తను "ఏమండోయి! ఇలాచూడండి!" అని వెనక్కి గిరుక్కున తిరిగి చూచేటట్టు చేసి "మరి చూచేది గుడ్డతెర మీద కదండీ! హరిజనలడ్కీని అందుమీద చూస్తే ఇంటికివచ్చి స్నానం చెయ్యాలసి వస్తుంది — నేను దానికై తేరాను" అంది భార్య. భర్త "ఎందుకు రావో చూస్తాను. I shall give a phinile wash to such hacknied old deep rooted ideas of vou Hindu women'. అని వెళ్ళిపోయినాడు. భార్య పై ఇంగ్లీషులో 'హిందూ' అన్న మాటను పుచ్చుకు కొంత మట్టుకు అర్థంచేసుకుని "మీరూ హిందువులే" అంటూ లోపలకు పోయింది. "ఇయంగేహేలక్ష్మి" నాటిరేత్రి మొదటిఆట చూచి తీరాలనుకుంది. ఏమైనా సరే తప్పదనుకుంది. పాడుపనులు చేయడానికి భర్త అనుజ్ఞ కావాలిగాని, మంచిపనులు చేయడానికి భర్త అనుజ్ఞ, భర్తకూడా వుండడం, ఎందుకు అని వో తీర్మానానికి వచ్చింది.

'గేహేలక్ష్మి' గురించిన టాకీచూస్తే స్త్రీలు చెడ్డాని కెంతమాత్రం అవకాశం లేదు. పైపెచ్చు మరింత శోభిస్తారు చూచివచ్చి' అని తనకుతాను లోలో బాగా హెచ్చరించుకుంది. "వారే! బంజర్! వెళ్ళి తక్షణం బండి తీసుకురా!" అంది. జట్కా వొకదాన్ని పిలుచుకువచ్చాడు. భర్త తిరిగి వస్తే అనాచార హరిజనలడ్కీకి చెవులట్టుక తనను ఈడ్చుకు వెళతాడేమో అనే ఆమెకు భయం కొద్దీ భర్త క్లబ్బునుంచి యింటికి రాకుండానే "బంజర్"ను అరుగుమీద కూర్చుని యిల్లు చూస్తూవుండమని నియమించి తానన్నీ చక్కబెట్టుకు, బండెక్కి మొదటి ఆటకు సరిగ్గా టయిముకు "ఇయం"కు చేరుకుంది.

రోహిణి అలావెళ్ళిన కాస్సేపటికి రంగారావు క్లబ్బుకే కాకుండా బజారుకూడావెళ్ళి ఓ ఫినైల్‌సీసా పొడుగుపాటిది 'స్నప్‌కలర్ క్రైంను'ది చూపులకు "విస్కీ బాటిలా!" అని అనిపించేరకాంది కొనుక్కుని ఇంటికి తిరిగి వచ్చేడు. భార్య ఇంకా ధిక్కారంచేస్తే "I brought a full Phinile Bottle to give a complete wash to your mummy ideas" అని బాటిల్ బాటిల్ చూపించి, బరాగా చెడ్దామని అతగాని పూరా సంకల్పం.

కాని ఇంటికివచ్చేసరికి "బంజర్"వల్ల సమస్తం తెలిసికొని రంగారావు మిక్కిలి "డిసపోయింటు" అయిపోయినాడు. ఏటాకీకీ వెళ్ళకుండా ఇంట్లో తనపడకటింట్లో అలమారులో తనభార్య బంగారు వస్తువులు దాచుకునేచోట, బాగా ఆమెకు కనబడాలని తానుతెచ్చిన ఫినైల్ బాటిల్‌పెటి, భార్య మూతెట్టిపెట్టిన భోజనం కడుపునిండా తిని, ఎత్తయిన పందిరిపట్టిమంచంమీద పడుకుని నిదరపోయాడు రంగారావు. "బంజర్" అరుగుమీద కునికిపాట్లుపడుతూ ఇల్లంతా కాపలాకాస్తున్నాడు.

ఠంగు, ఠంగు, ఠంగు, ఠంగు, ఠంగు, ఠంగు, ఠంగు, — మళ్ళీ గంటకు ఎనిమిది, మళ్లీ గంటకు తొమ్మిది, మళ్ళీగంటకు పది — సరిగ్గా పదికి రోడ్డంట జటకాబండి గుర్రపుగింగురావా, జట్కావాడు బండీ చక్రపు ఆకుల రవాకర్రగీస్తూ గావించే టకటక సౌదా దగ్గరపడి బండి గుమ్మంలో టకీమని ఆగటం, బండినుంచి రోహిణి దిగటం జరిగింది.

"బంజర్" కళ్లు నులుపుకుంటూ "నేనింటికి వెడుకున్నానండి అమ్మా!" అని వెళ్లిపోయినాడు.

రోహిణి ఇంటిలోపలకు వెళ్ళి తిన్నగా తన నడుము నున్న బంగారపు వొడ్డాణం, జబ్బలనున్న పొళ్ళ వొంకీలు, తీసికుంటూ దీపం హెచ్చించి, నిదరపోతూవున్న భర్తను చూస్తూ, వస్తువుల అలమారు తీసింది. వస్తువులుదాస్తూ భర్తనుంచి దృష్కులుమరల్చి అలమారులోకి చూచింది.

అలమారులో "బాటిల్!" ఆబాటిల్ చేత్తో అపాళంగా పుచ్చుకు ఆకాశమంత ఎత్తుకుఎత్తి, "ఈ మగాళ్ళను నమ్మకూడదు. ఒక్కమగాణ్ణి నమ్మకూడదు. టాకీలో లక్ష్మిమొగుడు అంతే — పెళ్ళాంచూడకుండా చెవామడా తాగేశాడు బోగందానింట. ఇక్కడ నామొగుడు అంతే. నేలేకుండా చూచి బాటిల్పట్టుకొచ్చి ఇందులో పెట్టుకున్నాడు. ఈ మగాళ్ళను నమ్మకూడదు" అని బాటిల్ బాటిలూ గదిలో గచ్చుమీద ఢిమ్మన పగలగొట్టింది.

ఉలిక్కిపడి లేచాడు రంగారావు. పడగ్గదంతా ఫినైల్ వొర్లూ సీసాపెంకులూను! భార్యకేసిచూచాడు. "ఎప్పుడు వచ్చేవు? అప్పుడే

ఎప్పుడు చేశావు ఈ అఘాయిత్యం''? అన్నాడు. రోహిణి ''బాగా చేశారు లేస్తురు! కాస్తంత చెబితేం అలమార్లో ఫినైల్‌బాటిల్ పెట్టానని'' అంది. రంగారావు ఇప్పుడైనా ''కంప్లీట్‌వాష్'' కలిగిందా నీ ''మోషన్‌లెస్ నోషన్సుకు'' అని అడిగాడు భార్యను.

''కంప్లీట్‌వాష్'' కేంగాని ఆ కథానాయకుడు వళ్ళుమరచి తెగతాగి బ్రాందీబుడ్డి విసరితే పాపం వాని పెండ్లాం ముఖంనిండా గాజుపెంకులు గుచ్చుకొని నెత్తురు వర్దయిపోయింది సుమండీ!'' అంది రోహిణి—''అ నెత్తురు వర్దకేంగాని ముందీ పెంకులెత్తు'' అన్నాడు రంగారావు. రోహిణి పెంకులెత్తుతూ ''అమ్మయ్యో! ఎంతెంత వాడిగా సూదిగా వున్నాయో! వీటిని తగలెయ్య, యీ గాజుపెంకులు! వాడట్టుకొచ్చిన సీసా మీరట్టు కొచ్చిన ఈసీసా వొక్కసైజుగా వొక్కచాయగా వుంటే, నిజంగా విస్కీ తెచ్చుకు ఇంట్లోతాగడానికి పెట్టుకున్నారు అని అనుకున్నాను క్షమించం''డి అంది.

''ఎంత అమాయకు రాలివే. ఎంత పూర్వకాలపు మనిషివే''అని బిందెడునీళ్లు మోసుకొచ్చి నేలను దిమ్మరించి, భార్యను ''చీపురట్టుకొచ్చి తుడిచెయ్యిదంతా'' అన్నాడు రంగారావు. రోహిణి చీపురెట్టి తుడుస్తూ గదంతా సబ్బునురుగులా సురుగై కిరోసిన్‌కంపు కొడుతూ పారుదల లేకుండావుంటే రిచ్చపోసాగింది. ''ఎందుకలా ఆశ్చర్యపోతావు?'' అన్నాడు రంగారావు. ''తూములో ఏదో మీఫినైల్కు అడ్డుకున్నట్టుంది. చీపురెట్టి ఎంతతోసినా అవతలకు పోవడంలేదు నీళ్ళు. నేతుడుస్తూ వుంటాను, మీరు కర్రెట్టిపొడుస్తురూ తూం'' అంది రోహిణి. రంగారావు తనచేతిబెత్తం తీసుకొచ్చి తూములోకి పోనిచ్చి ముందుకూవెనక్కూ పొడి

చాడు. రెండు మూడు పోట్లకు తూములోంచి పెరట్లోకి ఫినైల్‌నీళ్ళలో చేతెడుమట్టి యిన్నికాగితమ్ముక్కలు, అంతకల్మషం అవతలపడింది. రంగారావు ఆచెత్తంతాచూచి "ఇంత చెత్తాచెదారం ఎక్కణ్ణుంచి వచ్చింది" ? అన్నాడు. "ఈమధ్య నెల్లాళ్ళనుంచి గది తుడిపించడం లేదండీ కొత్తటాకీ 'గేహేలక్ష్మి'కి వెడదామనే ఉబలాటం కొద్దీ అడుగడుక్కీ, బంజర్‌గాణ్ణి బజారుకు పంపిస్తూ పాటలబొక్కులూ, వ్యంగ్యపుబొమ్మలూ తెప్పించడంతోనే సరిపోయింది. రేపు ఏకంగా తుడవొచ్చుకదా, కడగొచ్చుకదా అని అనుకొంటూంటే, మీరుతొందరపడ్డారు." అంది రోహిణి. "నేనేం తొందరపడ్డాను?" "తొందరపడ్డం కాదండీ ఇంతలోకే ఫినైల్ సీసా కొనుక్కురావడం।"

"ఇప్పటికైనా నీవూహలు మారినాయా ? "అన్నాడు. రంగారావు రోహిణ్ణి చేరదీసుకుంటూ. "మారకేం అంది. టాకీలు మూకీలుచూచేటైమూ వాటికోసమని మొహం వాచేటైమూ మనం మనయింటి పరిశుభ్రతకోసం మన పిల్లల ఆరోగ్యం కోసం వినియోగిస్తూ మనిద్దరం అన్యోన్యంగా వుంటే అదే "ఇయంగేహేలక్ష్మి" అదే "హరిజనలడికీ" అంది రోహిణి. "అవును" అన్నట్లు తలూపుతూ ఇంకా ఏదో సప్లిమెంటు చేయబోయాడు భార్య రిమార్కుకు భర్త. కాని అప్పటికప్పుడే పౌరజనులు, రెండో ఆటనుంచి తిరిగివస్తూ వారిలోవారు గావించుకొనే టాకీ కళా విమర్శనం వీధంట మారుమోగుతూంది.

"అండర్‌ట్రయల్" ముద్దాయికి మెళ్ళో బిళ్ళకట్టి చెడ్డీ తొడగడం సరియైన ధర్మసూక్ష్మతకాదని వొక బి. ఎ., బి. ఎల్., ప్రేక్షకుడు విమర్శిస్తూంటే వొక ఎమ్. బి., బి. యస్., ప్రేక్షకుడు "హరిజనలడ్కీ నాయకి రొమ్ము మీద ఆయువకుడు కొనగోట ఇన్‌సిషన్ ఇచ్చేముందు

ఐడిన్ రాసి మరీ ఇచ్చి యుండవలసింది'' అని పరామర్శించేడు. ఇరు శాలలకూ వెళ్ళి ఇరు ఆటలు ఇరుగ్గా వొకే రాత్రి చూచిన మరో మహానుభావుడు "బోత్‌బహూత్‌అచ్ఛాహై, విమర్శ జాంతానై, బోలో! భారత్ మాతకీజై!" అని కేకేశాడు.

ఇంట్లో రంగారావు రోహిణితో "My dear, not only you and I but the whole Hindu nation required a thorough phinile wash. No thought no restraint; సగంపట్నం ఇళ్ళు విడిచి పెట్టి ఇంకా వీధులంటే నడుస్తూవున్నారు'' అని గడియారం కేసి చూచినాడు. గడియారం కంచుమ్రోతలా పన్రెండు కొట్టింది. భార్యకేసి చూచాడు. భార్యమాత్రం ఏమంటుంది? "పన్రెండైం" దంది.

"అదికాదు. లోకంమరమ్మత్?" అన్నాడు రంగారావు. "నాతోటిదేగా మీకు లోకం." నన్ను మరమ్మత్తు చేస్తే లోకం అంతా మరమ్మత్తు చేసినట్టేగా అంది రోహిణి. రంగారావు "నీకు ఫినైల్‌వాష్‌ఖర్మమేం? ఇదిగో! అత్తరు." అంటూ చెంతనున్న అత్తర్‌దాన్‌తీసి రోహిణి పమిటకి మొగల్‌సెంటు రాస్తూ నవ్వుతూ నిద్దరోయాడు. భర్త కూర్కులో రోహిణికూడా తన కూర్కుసమేళంగావించి తోడనే చిరునవ్వు నవ్వుతూ పమిట చెదర నిదరోయింది.

—:o:—